క్లుప్తంగా

వైభవంగా చింతాలమ్మ జాతర


చింతాలమ్మ

మామిడికుదురు: పాశర్ల పూడిలంక గ్రామ దేవత చింతాలమ్మ జాతర శనివారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర నాలుగు రోజుల పాటు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, సోమవారం అమ్మవారి తీర్థం జరుగుతుందని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందన్నారు. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని భారీ విద్యుత్ దీపాల అలంకరణలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. జాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కులు చెల్లించారు.

ఘనంగా విశాలాక్షి అమ్మవారి తీర్థం


చెముడులంకలో విశాలాక్షి అమ్మవారిని దర్శించుకుంటున్న తమ్మన శ్రీనివాసు

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో వేంచేసిన విశాలాక్షి దుర్గమ్మ అమ్మవారి తీర్థం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ తీర్థోత్సవాల్లో పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెంటపాటి వెంకట్రావు, బుడ్డిగ వీర వెంకట్రావు, దొండపాటి చంటి, దొండపాటి శ్రీనివాసు పాల్గొన్నారు.

వైభవంగా భేతాళస్వామి ఆలయ వార్షికోత్సవం


అంబాజీపేటలో భేతాళస్వామి

అంబాజీపేట: స్థానిక శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయ భేతాళ స్వామి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం, 13 పాలాలకు చెందిన సంఘ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన చేపట్టారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, అభ్యుదయ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం మోహనరావు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి జలకం

అంబాజీపేట: తొండవరంలో వేంచేసిన గ్రామదేవత రాజ్యలక్ష్మి అమ్మవారి జలకం ఘనంగా సాగింది. అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు, నైవేద్యాలు చెల్లించుకున్నారు. అమ్మవారి జలకం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ఉన్న కాలనీల్లో అమ్మవారి పూజా ఘటాలను ఊరేగిస్తూ జలకం కనులపండువగా నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో సత్తిబాబు


సత్తిబాబు దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కృష్ణచైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆయనకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఆరోగ్యమస్తు

- ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్
- గ్రామాల్లో ఉచిత వైద్యం
- ప్రజలకు తప్పిన వ్యయ ప్రయాసలు

కొత్తపేట: ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం తద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ప్రజల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలతో పాటు 'ప్రజారోగ్యం ప్రధానం' అని గుర్తించింది. దానిలో భాగంగా తాజాగా 'ఫ్యామిలీ డాక్టర్' పథకం ప్రవేశపెట్టింది. ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకెళ్లింది. దానితో ఈ పథకం పేద, మధ్య తరగతి ప్రజల పాలిట వరంగా మారింది. 'వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్–ఫ్యామిలీ డాక్టర్' పథకాన్ని ఆ ఏడాది ఏప్రిల్ 6 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వేనోళ్ల కొనియాడుతున్నారు.

గతంలో ఏ చిన్న రోగమొచ్చినా పట్టణాలకే..

గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా, ఏ పెద్ద జబ్బు చేసినా ప్రాణాలు అరచేత పెట్టుకుని ఆఘమేఘాలపై పట్టణాలకు వెళ్లేవారు. దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు, గర్భిణులు, బాలింతలు కూడా పరీక్షలు నిమిత్తం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. పేద ప్రజలు వైద్యం చేయించుకోలేక, మందులు కొనలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్యులను, సిబ్బందిని గ్రామాలకు పంపిస్తుంది. దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి వైద్య పరీక్షలు, అవసరమైన వైద్యం నిమిత్తం వైద్యులు, సిబ్బందిని వారి ఇళ్లకే పంపిస్తుంది. మొదట మండలానికి ఒక 104 వైద్య సేవల వాహనం ఉండగా 'వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్–ఫ్యామిలీ డాక్టర్' పథకంతో మరో వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించింది. ఆ బృందం ప్రతి సచివాలయం పరిధికి నెలకు 2 సార్లు వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం పూట గర్భిణులు, బాలింతలు, పిల్లలు (నవజాత శిశువులు), చంటి పిల్లలతో పాటు ఇతరులకు ఓపీ సేవలు, బీపీ, టీబీ, క్యాన్సర్ తదితర టెస్ట్‌లు చేస్తున్నారు. మధ్యాహ్నం పూట అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు సందర్శిస్తారు. బాలలకు ఐరన్ మాత్రల పంపిణీ, మధ్యాహ్న భోజనం పరిశీలన, క్వాలిటీ పరీక్షిస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని, మంచం పట్టిన దీర్ఘకాలిక రోగులను పరీక్షిస్తున్నారు. ముఖ్యంగా 104లో ఈసీజీ, గర్భిణులకు ఫీటల్ హార్ట్ రేట్ మానిటర్, హెచ్‌బీ వంటి టెస్టులు, 14 రకాల లేజీ టెస్టులు, 90 రకాల మందులు అందుబాటులో ఉండగా అవసరమైన మందు ఇస్తున్నారు. టెలీమెడిసిన్ ద్వారా విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో స్పెషలిస్ట్ హబ్‌లలో వైద్యులను సంప్రదించి, వారి సూచనల మేరకు వైద్య సేవలు, మందులు అందజేస్తున్నారు. స్థానికంగా సాధ్యం కాని వైద్య సేవలకు రాజమహేంద్రవరం, కాకినాడ జీహెచ్ వంటి పెద్దాసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో వైద్య బృందాలు వచ్చేటప్పటికి విశేష స్పందన కనిపిస్తోంది.

కొత్తపేట మండలంలో..

104 వాహనాలు	2
సిబ్బంది	12
రోజు సగటున ఓపీ	400
రక్త పరీక్షలు (14 రకాలు)	65

అందుబాటులో వైద్య సేవలు



నా పేరు బిళ్లకుర్తి దుర్గ. బిళ్లకుర్రు సత్తెమ్మ కాలనీ, కొత్తపేట మండలం. గృహిణిగా జీవనం సాగిస్తున్నాను. మా ఆయనగారికి గతంలో గుండెపోటు వస్తే జగన్‌గారి ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో గుండె ఆపరేషన్ చేశారు. ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. ఇటీవల వరకూ రాజమహేంద్రవరం వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులు తెచ్చుకునేవారం. ఇప్పుడు మా ఇంటికే డాక్టర్, సిబ్బంది వచ్చి పరీక్షించి మందులు ఇస్తున్నారు. అంతేకాదు గతంలో ఏ చిన్న వ్యాధికి గురయినా కొత్తపేట లేదా, రాజమండ్రి వంటి దూర ప్రాంతాల్లో ఆస్పత్రులకు ఎన్నో వ్యయ ప్రయాసలతో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సీఎం జగన్ పుణ్యమా అని ఆ బాధ లేకుండా వైద్యులతో సహా సిబ్బంది గ్రామానికే కాక ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలందిస్తున్నారు.


బిళ్లకుర్రులో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు, మరో రోగికి రక్తపరీక్ష చేస్తున్న సిబ్బంది

ఇంటి ముంగిటకే వైద్య సేవలు సంతృప్తికరం



నాపేరు కాశి వెంకటేశ్వరరావు, కేదార్లంక గ్రామం. బీపీ, సుగరు వ్యాధులతో బాధపడుతున్నాను. గతంలో కొత్తపేటలో ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకునేవాడిని. ఇప్పుడు మేము ఏ విధమైన ప్రయాసలకు గురికాకుండా ప్రతి 15 రోజులకోసారి వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది మా గ్రామానికి, మా ఇంటి ముంగిటకే వచ్చి పరీక్షలు నిర్వహించి, మందులిస్తున్నారు. గతంలో ఏ సీఎం చేయని విధంగా సీఎం జగన్ మా గ్రామానికి, ఇంటికి వైద్యులను పంపిస్తున్నారు. మాలాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలకు చేరువైన ఆరోగ్య పథకం చాలా బాగుంది.

ప్రభుత్వ లక్ష్యం మేరకు వైద్య సేవలు



ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం గ్రామ సచివాలయాల పరిధిలో సిబ్బందితో వెళ్లి ఓపీ నిర్వహిస్తున్నాం. వివిధ పరీక్షలతో పాటు అన్ని రకాల రోగులకు వైద్య సేవలందిస్తున్నాం. ప్రభుత్వం అన్ని రకాల మందులు సరఫరా చేయగా రోగులకు అవసరమైన మందులు అందజేస్తున్నాం. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం గురించి ఫాలోఅప్ చేస్తున్నాం. ప్రజలు కూడా అందుబాటులోకి వచ్చిన సేవలకు అలవాటు పడ్డారు.

– కేఎస్ఎస్‌టీ హర్ష, వైద్యాధికారి, పీహెచ్‌సీ, వానపల్లి

అనధికార విద్యుత్ కోతలను ఎత్తి వేయాలి

మామిడికుదురు: అనధికార విద్యుత్ కోతలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆవేదన వ్యక్తం చేశారు. పాశర్లపూడిలో శనివారం జరిగిన సమావేశంలో రాంబాబు, మామిడికుదురులో జరిగిన సమావేశంలో సూర్యారావు మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై తీవ్ర భారం మోపారన్నారు. పెంచిన చార్జీలను తగ్గించడంతో పాటు కోతలను ఎత్తివేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. సమావేశాల్లో మొల్లేటి శ్రీనివాస్, యాలి శ్రీనివాస్, చుట్టుగుళ్ల కిశోర్, బోణం బాబు పాల్గొన్నారు.

శ్రీరాములు సేవలు మరువలేనివి

అంబాజీపేట: శెట్టిబలిజ సంఘాభివృద్ధికి దొమ్మేటి శ్రీరాములు చేసిన సేవలు మరువలేనివని అంబాజీపేట శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి రామారావు అన్నారు. ఇటీవల మృతి చెందిన వ్యాపారి దొమ్మేటి శ్రీరాములు అకాల మరణానికి చింతిస్తూ స్థానిక నాగమల్లి చెట్టు వద్ద సంఘం ఆధ్వర్యంలో శనివారం సంతాప సభ నిర్వహించారు. శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొంతు పెదబాబు, గుత్తుల పండు, మట్టపర్తి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనాల అభివృద్ధికి కృషి

అంబాజీపేట: ఎస్సీ కమ్యూనిటీ భవనాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. గంగలకుర్రులో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే ఎస్సీ కమ్యూనిటీ భవనానికి సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నెల్లి పండు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పితాని కాశీ, దొమ్మేటి నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వెంటనే సాయం.. సీఎం జగన్‌కే సాధ్యం

మలికిపురం: ఆపదలో ఉన్న బాధితులు అడిగిన వెంటనే సాయం అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం మలికిపురం మండలం కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నుంచి సాయం పొందిన పలువురు రోగులు, దివ్యాంగులు ఎమ్మెల్యే రాపాకను కలసి కృతజ్ఞతలు తెలిపారు. గత బుధవారం వీరంతా సీఎం జగన్‌కు హెల్ప్ మీ బోర్డులతో సాయం కావాలని కోరడంతో వీరందరినీ తన హెలీప్యాడ్ వద్దకు రావాలని సీఎం జిల్లా కలెక్టర్ ద్వారా కబురు పెట్టారు. వీరి ఇబ్బందులు స్వయంగా విన్న సీఎం తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు సూచించారు. సీఎం ఆదేశంతో ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున జిల్లా కలెక్టర్ శుక్లా అందించారు. ఈ మేరకు లబ్ధిదారులు ఎమ్మెల్యే రాపాకకు ధన్యవాదాలు తెలిపారు. అడిగిన వెంటనే సాయం చేసిన ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదని దివ్యాంగుడు పితాని ఏసుబాబు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు సీఎం రూ.2 లక్షలు ఇవ్వడం చాలా ఆనందరంగా ఉందని మేడిచర్ల సుజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రొక్కాల వెంకట్, గుండుమేను నారాయణమూర్తి, సుంకర బాబ్జి, కొల్లాబత్తుల అశోక్, మోకా దివాకర్, పంచాయతీ కార్యదర్శులు రేకపల్లి ఏసుబాబు, ఇంజేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం జగన్ ఆదేశంతో ఆర్థికసాయం పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

జగన్‌తోనే రాష్ట్ర ప్రజలకు మేలు

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: నిరంతరం ప్రజల్లో ఉండి ప్రజా సంక్షేమం కోసం పరితపించే దేశంలోనే అరుదైన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రజలకు చక్కని భవిష్యత్తు ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మండలంలోని రామరాజులంకలో శనివారం నాలుగో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. వలంటీర్లు, అధికారులు, గృహ సారథులు, కన్వీనర్లతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి వ్యక్తికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే తీసుకువచ్చారని అన్నారు. అంతే కాక ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ లబ్ధి అందాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని అన్నారు. సీఎం లక్ష్యాలకు అనుగుణంగా కార్యకర్తలు పని చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ముత్యాల నరసింహారావు, చింతా రాజబాబు, రావి గోపాలకృష్ణ, నల్లి శివకుమార్, వీఆర్‌ఓ నూకరాజు, కార్యదర్శి ఎస్‌డీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రామరాజులంకలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

నాడు అలా.. నేడు ఇలా..


మూలస్థాన అగ్రహారం వద్ద 216 ఏ జాతీయ రహదారిలో నెల రోజుల క్రితం మోడు వారిన తురాయి చెట్లు


మూలస్థాన అగ్రహారం వద్ద నేడు అవే చెట్లు వికసించి అందాలు విరబూస్తున్న దృశ్యం

ఆలమూరు: మోడు వారిన జీవితాలు వికసించక మానవు అనే సూక్తిని 216 ఏ జాతీయ రహదారిలోని మూలస్థాన అగ్రహారం వద్ద తురాయి చెట్లు నిరూపిస్తున్నాయి. అక్కడ మోడు వారిన తురాయి చెట్లు నేడు పూలవనాలయ్యాయి. వేసవి ధాటికి నెల రోజుల క్రితం చెట్టు అంతా ఎండిపోయి కళావిహీనంగా మారింది. మృగశిర కార్తె ప్రవేశించడంతో మళ్లీ ఆ చెట్లు వికసించి అందాలు విరబూస్తున్నాయి. మానవ జీవితానికి ఈ చెట్లు దగ్గరగా ఉన్నట్లు భావించాల్సిన అవసరం ఎంతైన ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పంట కాలువలు, డ్రైన్లు వెంటనే బాగుచేయాలి

కొత్తపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతున్న నేపథ్యంలో సాగునీరుకు అడ్డంకులు ఏర్పడకుండా పంట కాలువలు (చానల్స్) డ్రైన్లలో తూటు, తుక్కు, వ్యర్థాలు తొలగింపుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అంశాలు, ఖరీఫ్ సాగుపై సమీక్షించారు. చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా యంత్ర పరికరాలు గ్రూపులుగా చూస్తున్నారని, వాటిని రైతులకు వ్యక్తిగతంగా మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కౌలు రైతులకు డీసీసీబీ ద్వారా రుణాలు ఇవ్వాలని, ప్రతి రైతుకు రూ.30 వేలు రెండు దఫాలుగా ఇవ్వాలని కోరారు. ఏడీఏ వెంకటరామారావు మాట్లాడుతూ మండలానికి పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్స్ 3 మంజూరు కాగా ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు ఏ రకాలు కావాలో రైతులు తెలియజేస్తే ఆయా రకాలను ఆర్‌బీకేలకు దిగుమతి చేసే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో 60 మెట్రిక్ టన్నుల ఎరువుల టార్గెట్ ఇచ్చామని, ఎరువుల కొరత లేకుండా ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఖరీఫ్‌కు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ త్వరలోనే ప్రారంభమౌతుందని దీనికి రైతులు, ఆర్‌బీకే సిబ్బంది సంసిద్ధం కావాలని సూచించారు. సీహెచ్‌సీ గ్రూపులకు బ్యాంక్ వారు ఇచ్చిన రుణాలకు సంబంధించి డ్యూస్ సకాలంలో చెల్లించాలని, లేకుంటే వడ్డీ పడే అవకాశం ఉందని హెచ్చరించారు. సమావేశంలో ఏఓ పద్మలత, వీఏఏలు, వీహెచ్ఏలు, ఏఏబీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ నిషేధాజ్ఞలు

- నేటి నుంచి 20 రోజుల పాటు సెక్షన్ 30 అమలు
- పోలీస్ అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహిస్తే చర్యలు


డీఎస్పీ కేవీ రమణ

కొత్తపేట: స్థానిక పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 20 రోజుల పాటు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తూ నిషేధాజ్ఞలు విధించినట్టు డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. ఆ మేరకు శనివారం సాయంత్రం సబ్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లకు ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం అర్ధ రాత్రి నుంచి ఈ నెల 30 వ తేదీ వరకూ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీల్లేదని పేర్కొన్నారు. కొత్తపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం పోలీసుస్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఉత్తర్వుల ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపాలంటే ముందుగా సబ్ డివిజన్ పోలీస్ అధికారి అనుమతులు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకున్న ఈ చర్యలకు అందరూ సహకరించాలని కోరారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి


విఘ్నేశ్వరుని సన్నిధిలో మల్లికార్జునరావు దంపతులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామిని ఏపీ హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడ్జి దంపతులకు ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో, వేదా మంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన జడ్జి మల్లికార్జునరావు దంపతులను వేదపండితులు వేదాశీర్వాదం పలికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అలాగే ఆయన్నూ స్వామివారి సన్నిధిలో అమలాపురం సివిల్ కోర్టు జడ్జి గౌరీశంకర్, జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం

పి.గన్నవరం: మండలంలోని మొండెపులంక శివారు మల్లాయిపాలెంలో ఇంటి పంపకం విషయమై శనివారం అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు. ఇంటి పంపకం విషయమై గుడాల నాగార్జునరావు, గుడాల నాగదుర్గారావుల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. నాగార్జునరావు ఫిర్యాదు మేరకు నలుగురిపై, నాగదుర్గారావు ఫిర్యాదుతో ఒకరిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

లొల్లలో బంగారం, నగదు చోరీ


లొల్లలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రజనీకుమార్

ఆత్రేయపురం: మండలంలోని లొల్లలో శనివారం సాయంత్రం చోరీ జరిగినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం లొల్ల గ్రామానికి చెందిన ఉచ్చిలి వెంకటేశ్వరరావు తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు ఈనెల 8న కాపవరం వెళ్లాడు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి ఇంటిలోకి వెళ్లేటప్పటికీ చోరీ జరిగినట్లు వెంకటేశ్వరరావు గుర్తించాడు. దీంతో ఇంటిలో ఉన్న రూ.4.5 లక్షలు నగదు, 12 కాసుల బంగారం చోరీకి గురైనట్లు స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో సంఘటన స్థలానికి రావులపాలెం సీఐ రజనీకుమార్, ఎస్సై సీహెచ్ సుధాకర్‌లు చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.